క్లుప్తంగా

వాగులో మృత దేహం



కారెంపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని నాగులేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళ వారం సాయంత్రం పోలీసులు గుర్తించి వెలికి తీయించారు. మృతుడు ఎర్రగళ్ల నిండు చేతుల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని స్థానిక ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు : 9440796178 నంబరుకు కాని లేదా : 08649 272233 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఎస్ఐ రామాంజనేయులు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో రూ. 40 లక్షల వ్యయంతో 540 మీటర్ల నూతన సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ డీఈ కె.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గడప-గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎన్నెస్పీ కాలువ పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రం నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వరకు ఈ రహదారి నిర్మాణం ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో వేల్పూరు గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో నిరంతరం అధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనంతరం పనులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పనులు పరిశీలించిన వారిలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, ఏఈ వెంకటేశ్వర స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు లింగా శ్రీనివాసరావు, ముంద్రు రాఘవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

వినుకొండ (నూజెండ్ల): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వినుకొండ మండలంలోని దొండపాడు పంచాయతీ పరిధిలోని 5 వార్డు, హస్సనాయునిపాలెం పంచాయతీ పరిధిలోని 6వ వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేయడమైనదని రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్‌లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 8 నుంచి 10 తేదీ వరకు, ఈ నెల 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఈనెల 19వ తేదీన పోలింగ్, కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నట్లు వివరించారు.

ఈత పోటీల్లో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థికి పతకాలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ 2023-24 పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ 3 రజిత, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు మంగళవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీలలో కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఆక్వాటిక్ (స్విమ్మింగ్) చాంపియన్‌షిప్ పోటీలలో జగదీష్ 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు బటర్‌ఫ్లై విభాగాలలో రజిత పతకాలు, 200 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థి జగదీష్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి ఆజాదికా అమృత్ మహోత్సవం

శావల్యాపురం: ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నీ గ్రామపంచాయతీల్లో నేటి నుంచి ఈనెల 15 వరకు వివిధ రకాల కార్యక్రమాలు ప్రజాప్రతినిధులు, అధికారుల సారథ్యంలో ప్రారంభం అవుతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ నాభూమి-నాదేశం నేల తల్లికి నమస్కారం అమరవీరులకు వందనం కార్యక్రమం, ప్రతిజ్ఞ, వసుద వందనం, అమర వీరులకు ఘన నివాళి, చివరి రోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయపతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ ఉపాధి పథకం నిధులు రూ. 7 వేల వ్యయంతో నాభూమి-నాదేశం శిలాఫలకం నూతనంగా ఏర్పాటు చేసి తదుపరి ప్రజాప్రతినిధుల సారథ్యంలో ఆవిష్కరించానన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నాదెండ్ల: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై జె.బలరామిరెడ్డి చెప్పారు. జాతీయరహదారిపై గణపవరం వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు తదితర వాహన చోదకుల వద్ద పత్రాలు పరిశీలించారు. పత్రాలు సరిగా లేని, నిబంధనలు పాటించని వారిపై 15 కేసులు న మోదు చేసి రూ.2 వేల అపరాధ రుసు ము వసూలు చేశారు. ఎస్సై మాట్లాడు తూ మైనర్లు వాహనాలు నడపకూడదని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయటంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం, ఓవర్ లోడ్‌తో ప్రమాదాలకు కారణమౌతాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు రవాణ నిబంధనలు పాటించాలన్నారు. ఆయ నతో పాటూ ఏఎస్సై రమేష్ ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పట్లవీడులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం ద్వారా పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పట్లవీడు గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలతో పనిలేకుండా అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతోనే వైఎస్సార్ సీపీ పనిచేస్తోందన్నారు. ఎవరూ అసంతృప్తి చెందకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి మేలు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమ నిర్వహణ విజయవంతంగా సీఎం జగన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల బాధలను తెలుసుకునేందుకు మరింత ముందుకెళ్ళే కార్యక్రమంలో భాగంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలుంటే ఎవరైనా తెలియపరచవచ్చునని ప్రభుత్వ విప్ పీఆర్కే చెప్పారు. రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ. 15 లక్షలతో నిర్మించిన విలేజి క్లీనిక్, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, గ్రామసర్పంచ్ చల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని పలుచోట్ల ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పట్లవీడు గ్రామంలోని 125 గృహాలలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరించారు. భూములకు రైతు భరోసా పథకం ద్వారా రూ. 13500లు ప్రతి ఏటా అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 87% కుటుంబాలకు లబ్ధి చేకూర్చిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల దేశంలో 5వ స్థానంలో నిలిచారన్నారు. ప్రజలకు ఇప్పటి వరకు జరిగిన లబ్ధి గురించి వివరించారు. సంక్షేమ పథకాలను ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తోందన్నారు. అర్హులై ఉండి పథకాలు అందని వారుంటే ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ద్వారా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, విదేశీ విద్య, అమ్మ ఒడి వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చింతా శివరామయ్య, మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాయంకుల గోపాల్, అలుగుమల్లి సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోనుగుంట శ్రీనివాసరెడ్డి, గుండెబోయిన నాగేశ్వరరావు, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు చల్లా పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా అంజి, చౌడయ్య, ఎంపీడీఓ డి ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, వీఆర్ఎఈ శ్రీనివాసరెడ్డి, కోనుగంటి మణికంఠారెడ్డి, బాలబోయిన చంద్రశేఖర్, ఎట పుల్లారెడ్డి, డా. శ్రీరామ్, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మిర్చినారు రైతులకు అందించాలి

ఉద్యానశాఖ అధికారి మోహన్



నర్సరీలో మిర్చినారు పెంపకంలో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న గురజాల హెచ్ఓ మోహన్

రెంటచింతల: ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన విత్తనాలతో సస్యరక్షణ చర్యలు చేపట్టిన నాణ్యమైన మిర్చినారును మాత్రమే నర్సరీ నిర్వాహకులు రైతులకు అందించాలని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ అన్నారు. మంగళవారం రెంటచింతల లోని పలు నర్సరీలను ఆయన సందర్శించి వాటి నిర్వాహకులకు మిర్చినారు పెంపకంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను, సూచనలు చేసి మాట్లాడారు. సాంప్రదాయ పద్ధతిలో నారు పెంచే సమయంలో అధిక వర్షాలు పడిన సమయంలో మొక్కలకు కోయినోఫోరా ఎండు తెగులు ఆశిస్తున్నట్లు గమనించిన దాని నివారణకు 10 లీటర్ల నీటికి కాపర్ ఆక్సి క్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపిన ద్రావణం పిచికారి చేయాలన్నారు. నారు వాడబడి తలలు వాల్సినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారి చేసుకోవాలని సూచించారు. వేరు కుళ్ళు ఆశించిన నారుమళ్ళలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బండజిం 10 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని నారు లేదా మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. పాలిట్రే, ప్రోట్రేలలో నారు పెంచడం లేదా షేడ్ నెట్‌లలో మిర్చినారు పెంచే చోట అధిక వర్షాలు పడినప్పుడు ప్రోట్రేలలో ఉన్న మొక్కలపై వెంటనే కప్పేయాలని, నీరు నిలబడకుండా కాలువల ద్వారా నీరు పారించాలని సూచించారు. నారు కుళ్ళు తెగులు కనపడిన వెంటనే నీటి తడులను ఆపేయాలన్నారు. రైజోక్టోనియా వేరు కుళ్ళు నివారణకు ట్రేలలో నింపే మిశ్రమంలో ట్రైకోడెర్మావిరిడి కలపాలన్నారు. మ్యాంకోజెబ్, కార్బండజిమ్ మిశ్రమాలలో లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. వాతావరణం మబ్బుగా ఉండి వరుసగా వర్షాలు పడినప్పుడు బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా కనబడుతుందన్నారు. ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు+ఒక గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అధికారుల సూచనలతో తెగుళ్ళు పోకని నాణ్యమైన మిర్చినారును రైతులకు అంధించినప్పుడే అధిక దిగుబడులు వస్తాయన్నారు.

పట్లవీడు గ్రామాభివృద్ధికి కృషి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పై ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్లవీడు గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని, రూ. 21 లక్షలతో నిర్మించిన విలేజ్ క్లీనిక్‌ను ప్రారంభించారు. పట్లవీడు గ్రామానికి సీఎం జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత రూ. 11.45కోట్లు వివిధ పథకాల ద్వారా అందజేశారన్నారు. టీడీపీ నాయకులు గతంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా విమర్శలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. టీడీపీ నాయకులు వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, వారికి ఇప్పటికే నాలుగుసార్లు ప్రజలు బుద్ధిచెప్పారన్నారు. 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు కోనుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గుండెబోయిన నాగేశ్వరరావు, కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శరవేగంగా జలదీక్ష పనులు

- కృష్ణమ్మ చెంతనున్న ఎంతో కాలంగా తీరని సమస్య
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీతో నేడు సాకారం
- మాచవరం మండలానికి రూ.15 కోట్ల 30 లక్షలు మంజూరు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో ఇంటింటికీ కుళాయి



అయా గ్రామాల్లో జరుగుతున్న పైపులైన్ల నిర్మాణ పనులు



మాచవరం: ప్రజలకు సేవ చేయాలన్న కాంక్ష ఉంటే ఏదైనా సాధించవచ్చు. నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణాలు చేపట్టి వ్యవసాయం చేసే రైతుల సాగునీటి కష్టాలు తీరిస్తే, అదే స్ఫూర్తితో నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గంలో తాగునీటి అవసరాలు తీర్చాలనే లక్ష్యంతో జలదీక్ష చేపట్టారు. ఎన్నికల సమయంలో చేపట్టిన గడప గడపకూ వైఎస్సార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే కాసు ఇచ్చిన నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించి గ్రామాల ప్రజల తాగునీటి కష్టాలు తీరుస్తున్నారు.

రూ.218 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీరు...

నియోజకవర్గంలో రూ.218 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కార్యక్రమం ద్వారా పైప్‌లైన్ల నిర్మాణానికి మాచవరం మండలానికి సుమారు రూ. 15 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరు కాగా, ఇప్పటికే మండలంలో తురకపాలెంలో పైప్‌లైన్ల నిర్మాణం, ఇంటింటికీ కుళాయి పనులు పూర్తి అయ్యాయి. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా తురకపాలెంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదగా ఇంటింటికీ మంచినీటి కుళాయిని ప్రారంభించడం జరిగింది. చెన్నాయపాలెం, కొత్తగణేశునిపాడు, శ్రీరుక్మిణీపురం, నాగేశ్వరపురంతండా గ్రామాల్లో పనులు శరవేగంగానూ, పిన్నెల్లి, మాచవరం గ్రామాల్లో చురుగ్గా పనులు జరుగుతున్నాయి. మరో పక్షం రోజుల్లో వేమవరం, గంగిరెడ్డిపాలెం, మల్లవోలు, పిల్లుట్ల, కొత్తపాలెం, రేగులగడ్డ, మోర్జంపాడు గ్రామాల్లో పనులు మొదలు కానున్నాయి.

మాచవరం మండలానికి మంజూరైన నిధుల వివరాల ఇలా ఉన్నాయి

1.రేగులగడ్డ	రూ.43 లక్షలు
2.చెన్నాయపాలెం	రూ.65 లక్షలు
3.వేమవరం	రూ.3కోట్ల54 లక్షల 40 వేలు
4.తురకపాలెం	రూ.40 లక్షలు
5.మాచవరం	రూ.2కోట్ల 10లక్షలు
6.గంగిరెడ్డిపాలెం	రూ. 1కోటి18 లక్షల 60 వేలు
7.పిన్నెల్లి	రూ.1 కోటి 63 లక్షలు
8.మోర్జంపాడు	రూ.1కోటి 20 లక్షలు
9.మల్లవోలు	రూ.40 లక్షలు
10.పిల్లుట	రూ. 1కోటి 97 లక్షల 30వేలు
11.శ్రీరుక్మిణీపురం	రూ. 25 లక్షలు
12.నాగేశ్వపురం తండా	రూ.23 లక్షలు
13.కొత్తగణేశునిపాడు	రూ.43 లక్షలు
14.కొత్తపాలెం	రూ.60 లక్షలు

ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే లక్ష్యం

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తూ , ప్రజా సంక్షేమం, అభివృద్దే. లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోంది. గురజాల నియోజకవర్గంలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీరును అందించడమే లక్ష్యం. వచ్చే రెండేళ్లలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పైపులైన్లు నిర్మాణం చేపట్టి , పనులు పూర్తి చేస్తాం

–ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గ్రామస్తుల చిరకాల కోరిక తీరింది.

ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకం ద్వారా గ్రామస్తుల చిరకాల కోరిక తీరింది. గతంలో మంచినీటి కోసం వీధి కొళాయిల వద్ద ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ నేడు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మంచి నీటి సమస్యకు నేడు పరిష్కారం లభించింది. గ్రామంలో మంచి నీటి కష్టాలు తీరనున్నాయి.

– వట్టి రామిరెడ్డి మాజీ సొసైటీ అధ్యక్షుడు, చెన్నాయపాలెం



మహిళలు ఎంతో ఆనందంగా ఉన్నారు.

గ్రామంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేయడం వల్ల మహిళల మోములో చిరునవ్వులతో ఆనందం వ్యక్తమవుతుంది. నేరుగా ఇంట్లోకే మంచి నీరు రావడంతో మహిళల కష్టాలు తీరాయి. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చొరవతో గ్రామంలో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–షేక్ అల్లాభక్షు. తురకపాలెం సర్పంచ్. సర్పంచుల సంక్షేమ సంఘరాష్ట్ర ఉపాధ్యక్షుడు

టీడీపీ హామీలు నీటిమీద రాతలే

- ఇదిగో వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి.. కనబడుతుందా..
- టీడీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడా...?
- మీరు ఇచ్చిన హామీలు కూడా.. మేము చేశాం
- సెల్ఫీ చాలెంజ్ ఫొటోలతో ఎమ్మెల్యే కాసు



జగనన్న కాలనీల వద్ద సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న ఎమ్మెల్యే కాసు



జాతీయ రహదారి ఏర్పాటు చేస్తున్నట్లు సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న కాసు

గురజాల : తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా చెరిగిపోతాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి మండలంలోని చేసిన అభివృద్ధి పనులను చూపిస్తూ మంగళవారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సెల్ఫీ చాలెంజ్ ఫొటోలు దిగారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు మీ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు మేము చేసిన అభివృద్ధి పనులకు బహిరంగ చర్చకు సిద్ధామా అని గతంలోనే చాలెంజ్ విసిరారు.కానీ వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అభివృద్ధి చేయకనే వారి నుంచి స్పందన రాలేదని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనకబడిన పల్నాడు ప్రాంతానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధికి తోడ్పాటునందిచడం జరుగుతుందన్నారు.

గ్రామాలను తయారు చేసాం...

సొంత యిల్లులేని నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు నియోజకవర్గంలో జగనన్న కాలనీ రూపంలో 22వేల మందికి పట్టాలు పంపిణీ చేశాం. పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా మొదటి విడతగా గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల పట్టణాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు ఒక్కొక్క యింటికి రూ.2లక్షలు రూపాయలు ఇచ్చాం.22 వేల పట్టాలు పంపిణీ చేసి 63 కాలనీలను ఏర్పాటు చేశాం. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క కాలనీ అన్నా నిర్మాణం చేశారా చేస్తే సెల్ఫీ ఫొటో దిగి పెట్టండి ప్రజలు చూస్తారు. టిడ్కో ఇల్లు పేరుతో పెద్ద స్కాంకు తెరలెపారన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్ధిదారులకు భారం కాకుడదనే ఆలోచనతో మొత్తం ప్రభుత్వం భరాయించే విదంగా చర్యలు తీసుకుని టిడ్కో ఇళ్లను నిర్మాణం చేయడం జరిగిందన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాం...

దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడు రోడ్డు, నారాయణపురం రోడ్డు, కోట్ల బజారు విస్తరణ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి ఆ ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించి రహదారులు విస్తీర్ణం పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసాం. గత 7 సంవత్సరాల క్రితం కాటేరు వాగు పొంగిపార్లి దుకాణాల్లోకి, ఇళ్లలోకి నీరు ప్రవేశించి ఎంతో ఆస్తి నష్టం వాటిల్లింది. ఆ రోజుల్లో చంద్రబాబునాయుడు వచ్చి కాటేరు వాగును మేము ఆధునీకరణ చేసి ఇబ్బందులు లేకుండా చేస్తామని కాటేరు వాగు అభివృద్ధికి రూ.10 కోట్లు ఇస్తామని చెప్పి చంద్రబాబునాయుడు కనీసం 10 రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. మరలా తరువాత వరదలు వచ్చి దుకాణాలు , ఇళ్ల నీటిలో మునిగిపోయాయి. వెంటనే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కాటేరు వాగును అందరి సహకారంతో ఆధునీకరణ చేశాం. దాచేపల్లి నుంచి గురజాల మీదుగా మాచర్లకు రూ. 400 కోట్ల రూపాయల నిధులతో జాతీయ రహదారిని తీసుకువచ్చి ఏర్పాటు చేస్తున్నాం. పనులు కూడా ప్రారంభించడం జరిగింది. చంద్రబాబు నాయుడు, యరపతినేని శ్రీనివాసరావుల హయాంలో ఎక్కడైనా ఎప్పుడైన ఒక హైవే రోడ్డును ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు.

ఆటోనగర్ ఏర్పాటు చేశాం..

15 సంవత్సరాల నుంచి ఆటోనగర్ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురు చూశారు. ఈ స్థలాన్ని ఏపీఐఈసీకి అందించి టీడీపీ హయాంలో ప్లాట్లు వేసిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేము దీనిపై క్షణ్ణంగా పరిశీలించి ప్లాట్లు వేసి పారదర్శకంగా బ్రహ్మాండంగా ఆటోనగర్‌ను ఏర్పాటు చేశాం. ఆటో నగర్‌కు మహనీయులు అయిన ఏపిజె అబ్దుల్ కలాం గారి పేరుగా నామాకరణం చేయడం జరిగింది. మీ హయాంలో ఎమన్నా ఒక్క పని అన్నా చేశారా చేసిన పనులు ఉంటే మా లాగే సెల్ఫీ ఫొటోలు పెట్టాలని నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు సవాల్ విసిరారు.

నేడు మండల పరిషత్తుసర్వసభ్య సమావేశం

కారెంపూడి: మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మేకల శారద అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలు, తాగు నీరు, పారిశుద్ధ్యంపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న సంపూర్ణ పోషణ పథకం అమలు తీరు, కాపు నేస్తం, ఇతర పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సంబంధిత వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరు కావల్సిందిగా ఎంపీడీఓ కోరారు.

పలువురికి లయన్స్ సేవా పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న నక్కా కోటేశ్వరమ్మ

చిలకలూరిపేట: లయన్స్ క్లబ్ సేవా పురస్కారాలను చిలకలూరిపేటకు చెందిన క్లబ్ సభ్యులు దక్కించుకున్నారు. 2021-22 సంవత్సరానికి సంబంధించి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ విజేత అవార్డు కార్యక్రమం గుంటూరులోని బీవీఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేటకు చెందిన నక్కా కోటేశ్వరమ్మకు బెస్ట్ జోన్ చైర్మన్, లయన్ లేడీ ఆఫ్ ది ఇయర్, బెస్ట్ అడ్మినిస్ట్రేషన్ అవార్డులు లభించాయి. అలాగే ఇదే క్లబ్‌కు చెందిన బెస్ట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కొల్లా అమర్, బెస్ట్ సెక్రటరీగా పెరుమాళ్ల సురేష్, బెస్ట్ గవర్నర్ అడ్వైజర్స్‌గా డాక్టర్ కొల్లా రామారావు, శిఖాకొల్లి శ్రీనివాస గుప్తా, చుక్కా విన్సెంట్ పాల్, బెస్ట్ డిస్ట్రిక్ చైర్మన్‌గా పోలిశెట్టి నాగేశ్వరరావు, బెస్ట్ లయన్ లేడీస్ క్లబ్‌గా ఆలపాటి పద్మావతి అవార్డులు అందుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నట్లు నక్కా కోటేశ్వరమ్మ తెలిపారు.

మూడు గ్రామాల్లో ఉప ఎన్నికల సందడి

నాదెండ్ల: గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల ఉప ఎన్నికల సందడి ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం నుండి గురువారం వరకూ ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు వేసే అవకాశం కల్పించారు. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో వార్డు నెం.6 (ఎస్సీ రిజర్వు), అమీన్ సాహెబ్ పాలెం వార్డు నెం.4 (ఎస్సీ రిజర్వు), ఎండుగుంపాలెం వార్డు నెం.5 (ఎస్టీ రిజర్వు) స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ఈ మూడుస్థానాలకు ఎన్నికలు జరగ్గా, అభ్యర్థులు మృతి చెందటంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. 11వ తేదిన నామినేషన్ల పరిశీలన, 14 సాయంత్రం నామినేషన్ల విత్‌డ్రా, అదే రోజు సాయంత్రం 5 గంటలకు తుది జాబితా ప్రకటించనున్నారు. ఆగస్టు 19 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇర్లపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తూబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణారావు, అమీన్ సాహెబ్‌పాలెం ఆర్‌వోగా సంకురాత్రిపాడు జెడ్పీహైస్కూల్ హెచ్ఎం జానకీధరరావు, ఎండుగుంపాలెం ఆర్వోగా ఎంఈవో ఆంజనేయులు నియమితులయ్యారు.